

# పాపాయి నవ్వుతుంది

• గోవిన్దరాజు సుందరరావు •

మీ పాపాయి నవ్వాగే నవ్వదు.

బంగారుకాంతితో ఆ ఉయ్యాల్లో కూచుని నవ్వుతూవుంటుంది మా పాపాయి. దానికి విచక్షణలేదు. మనస్తత్వం సైకాలజీలతో పనేలేదు. మానవజీవితాన్ని పరిపాలించే కామం దాన్ని పరిపాలించడంలేదు. అదే దాన్ని పరిక్షిస్తున్నది కామాన్ని! నేను అలా దాని కళ్ళల్లోకి చూస్తూంటే అర్థంకాదు కామాలు—

మా పాపాయి నవ్వుతుంది.

... ... ...

మీ పాపాయికీ మా పాపాయికీ స్నేహం! ఎందుకంటే ఓర్ని ఓరు కలుసుకుని మాట్లాడుకోరు గనక. మాట్లాడుకుంటే స్నేహం క్షీణించివుండేది వారిద్దరికీ... ఆ ఉయ్యాలలో మా పాపాయి కూచునివుంటుంది. ఉయ్యాల చిన్న పెంకుటింటికి బయటవేసివుంటుంది సాయంత్రంపూట! దక్షిణపు గాలి జోకొడుతుంది గావును. ఆ చెట్టు మీంచి చిన్నచిన్న ఆకులురాలి దానిమీదపడి ఆడుకుంటయి. అప్పుడప్పుడు దగ్గరున్న పొగడచెట్టు మీంచి గాలి తీసుకొచ్చి కొన్నిపూలు అప్పచెప్తుంది. నిద్రమేలుకుంటే, స్వర్గస్వప్నంలోంచి మానవప్రపంచంలో పట్టంవల్ల గావును, కలవరపడి అదేమిటో అర్థంకాక ఏడుస్తుంది. కాని యింట్లో ఏమిటి జరుగుతున్నదో, తెలియదు దానికి పాపం. కాని ఏ దైవశక్తో ప్రేరేపించి దానికి విచక్షణ అన్నే జ్ఞానం ప్రసాదిస్తే, ఏ అపూర్వ తేజమో దానికి శక్తి ప్రసాదిస్తే, అది నిజంగా ఎంత బాధ్యతతో కష్టాన్ని ఎదుర్కోడానికి సిద్ధపడుతుంది? నాకు తెలుసును. దాని హృదయంలో అంత సానుభూతి గుప్తమై వున్నది. పాపం వొంట్లో శక్తిలేదు. బుర్రలో జ్ఞానంలేదు.

పాపాయి నవ్వుతుంది.

... ... ...

మీ పాపాయి బంగారు ఉయ్యాలలో కలతనిద్రపోతున్నది. ఎంత బాగుంటుంది వీరిద్దరికీ పెళ్ళిచేస్తే! యిప్పుడు కాదుగా చేసేది, వాళ్ళు పెద్దవాళ్ళైనాక కదా, అప్పటికి మనస్థానం ఎలా మారుతుందో చెప్పగలరా? అయితే ఎందుకు వొప్పుకోరు మీరు? అంతఃపురంలో పెరిగిన మీ పాపాయి తల్లిని గుర్తుపట్టగలదా తరవాత? లేదు లేదనుకుంటాను. మీ యింటికి యింతమంది జనం వొచ్చారు యీ వేళ. మీ సంతోషం అధికారం. మీ ధనం దాన్ని బలపరుస్తుంది...మాకూ సంతోషం వున్నది. సంతోషానికి యింతమందితో పనివున్నదా అని నా కాశ్చర్యమేస్తున్నది. మీ పాపాయిని చూడ్డానికికూడా నాకు అధికారం లేకపోయింది...మా యింటికొచ్చి ధర్మం పాపాయికి ఉద్బోధిస్తాను.

పాపాయి నవ్వుతుంది.

... ... ...

మీ పాపాయి పోయిందని విని ఎంతబాధపడ్డాను? ప్రపంచంలో పుట్టి ఏంపాపం చేసిందని దాన్నింత కఠినంగా శిక్షించాడు భగవంతుడు? మా పాపాయికి యీ సంగతి చెప్పను. చెప్పినా

అది ప్రశ్నార్థకంగా చూసి బాధపడుతుందని నా ఉద్దేశం. అంతఃపురమంతా బోసిపోయింది. లోపల అంధకారంగా వున్నది. పాపాయిమీద యీ వేళ పొగడపూలు పడ్లేదు. మామూలు వేళకి పడకపోతే ఆశ్చర్యంగా క్రొత్తగా దానిమనస్సు కలవరపడిపోయింది. చెట్టుకింద నే ఉయ్యాల వున్నది. కళ్లు పైకెత్తి పొగడవృక్షం కేసి చూస్తున్నది.

నేను వెళ్ళి దానికి ఏం చెప్పానో అది అర్థం చేసుకోలేదు. నే చూపించినవేపు మెల్లిగా కళ్లు తిప్పింది. రాజుగారి ఆవరణ కనబడివుంటుంది దానికి. తోటలో పూలవృక్షాలు ఆకర్షించివుంటాయి. మీద నే వెలిగించిన రంగుదీపం ఆశ్చర్య పరిచివుంటుంది ... వెంటనే ఆరిపోయింది అది. కళ్లు నా వేపు తిప్పి నవ్వింది. నవ్వింది. యింకా యింకా బాగా ఘట్టిగా నవ్వింది. అంత శక్తి బోసినోట్లో ఎలాగొచ్చిందో నాకు తెలియదు.

మా పాపాయి నవ్వుతూనేవుంటుంది.

---



వాటికన్ అంచనా ప్రకారం ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో మృతుల సంఖ్య రెండుకోట్ల ఇరవై లక్షల అరవై వేలమంది.

... ... ...

ఈ యుద్ధం మూలంగా రష్యాజననష్టం ఒక కోటి డెబ్బయి లక్షలమంది. ఇందులో యుద్ధ భటులు, సివిలియన్‌లుకూడా ఉన్నారు.

... ... ...

జూలై నుంచి నవంబరు ఆఖరువరకు కలకత్తాలో రహదారీ ప్రమాదాలవల్ల రోజుకి ఒక మనిషి వంతున చనిపోయారు.




శృంగారదేవత

యగు మదనుండు వసంతఋతువుకడచిన వెనుక యువతీ జనుల తల వెండ్రుకలలో చిరస్థాయి యగునని మహాకవి కాళిదాసు పలికెను. దేవతలను సైతము ముగ్ధులనుచేసి యాకర్షించు నాకేశసంపదను కేశవర్ధిని నుపయోగించి సర్వకాలములయందు మనోజ్ఞముగ వృద్ధిచేసికొనరాదా!

కేశవర్ధిని మీ కుంతలములకు ప్రకాశము, ప్రకాశమునకు తగిన అందము, అందమునకు తగిన యౌవనము నిచ్చును. విశేషించి బాల్యమునుండియే కురుళ్ళను గట్టిపరిచి రాలనీయక కాపాడును. కేశవర్ధిని తులలేని చక్కని పెన్నెరులను ఆనెరికురులు మీ కద్వితీయ సౌందర్యము నిచ్చును.

**కేశవర్ధిని**

నేడే మీ కురులకు కేశవర్ధిని వాడుడు.

మీ తలవెండ్రుకలను అందముగా పెంచి బలపరచును.

కేశవర్ధిని అ. 12. కేశవర్ధిని షాంపూ అ. 12.

ప్యాకింగు, పోస్టేజి అధికము.

వర్తకులందరివద్దను దొరకును లేక

సౌత్ యిండియా కెమికల్స్,

ఆర్. ఎస్. పురం, కోయంబత్తూరు.